## స్రవంతి నెం: 11లో ఇచ్చిన

"గృహప్రవేశమయిన రెండేళ్ళకుగానీ ఇల్లుకట్టలేనండీ" అన్నాడు వినయమూర్తి వినయంగా మామగారితో

## వాక్యం ఆధారంగా రాసిన కథలు

"నాకీ ఊరు ట్రాన్స్‌ఫర్ అయిందండీ. అర్జంటుగా జాయినవ్వాలి. అందుకనే అర్జంటుగానే వచ్చేసాను" అన్నాడు మూర్తి సామానంతా ఇంట్లో పెట్టిస్తూ.

ఆ మాటకు అదిరిపడ్డాడు ఆనందరావు, ఇక ఈ ఇంట్లోనే తిష్ట వేస్తాడేమోనని. అయినా ఆ భావం పైకి కన్పించనీయలేదు.

పదిహేనురోజులు గడిచాయి.

"బాబూ! స్థలంకొన్నావట! అమ్మాయి చెప్పింది" అన్నాడు ఆనందరావు భోజనాల దగ్గర.

"అవునండీ. మా ఆఫీసువాళ్ళంతా తీసుకుంటుంటే నేనూ ఒక ప్లాట్ తీసుకున్నాను. వచ్చే నెలనుంచి ఇంటిపని ప్రారంభించాలనుకుంటున్నాను" చెప్పాడు మూర్తి.

నెల గడిచింది. జీతాలందినా మూర్తి ఒక్క రూపాయికూడా మామగారికివ్వలేదు. కనీసం మర్యాదకుకూడా.

"ఉన్నన్నాళ్ళూ ఇంతేకాబోలు! ఇలా అయితే నా పని గోవిందా!" అనుకుని ఎలాగైనా అతనిని వేరేకాపురం పెట్టించాలనుకున్నాడు ఆనందరావు.

ఒకరోజు

"బాబూ! ఆ ఇంటిపనేదో తొందరగా చేసి అందులోకి వెళ్తేగాని మీకు సుఖం ఉండదు. ఈ చిన్న ఇంట్లో రెండు కుటుంబాలవల్ల నీకు ఇబ్బందే అవుతున్నట్టుంది" అన్నాడు.

"ఫరవాలేదండీ. ఎలాగోలా సర్దుకుంటాంగానీ కొత్తగా ఇల్లు వెంటనే కట్టెయ్యాలంటే మాటలా! మీ ఇంట్లో గృహప్రవేశమయిన రెండేళ్ళకుగానీ కొత్తయిల్లు కట్టలేనండి" అన్నాడు వినయమూర్తి మామగారితో సవినయంగా.

ఒక్కక్షణం ఆనందరావు గుండె ఆగినట్టయింది. "రెండేళ్ళంటే 48వేలుసుమారు. అయ్యబాబోయ్!" అని కొంచెంసేపు ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాడు.

పదిరోజులు గడిచాయి.

ఉదయాన్నే నిద్రలేచిన మూర్తి ఇంటి ముందున్న లారీలో సామానెక్కిస్తున్న ఆనందరావుని చూసి, ఆశ్చర్యంగా...

"ఏమిటిమామగారూ! ఈ ప్రయాణం?" అన్నాడు.

"ఏం చెప్పను బాబూ! అనుకోకుండా నాకూ ట్రాన్స్‌ఫర్ అయింది. ముందుగా చెప్తే నువ్వు బెంగపడతావని చెప్పలేదు. జాగ్రత్త బాబూ!" అని చెప్పేసి లారీ ఎక్కేసాడు.

మూర్తి ఎత్తుకు పైఎత్తు వేసి కోరి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నట్టు తెలియని వినయమూర్తి విభ్రాంతిగా చూస్తూ నిలబడిపోయాడు. *

— యం. గోపాలకృష్ణమూర్తి
(నీలానగరం)

## చెప్పుదెబ్బ

లక్షలార్జించినా డబ్బుకు గడ్డితినే రంగనాథం కూతురు సుందరి పెళ్ళినికూడా వాయిదా వేయసాగాడు.

ఇక లాభం లేదని వరాన్వేషణకు బయల్దేరాడు పీనాసి రంగనాథం.

ఎక్కడ చూసినా పెళ్ళికొడుకుల రేటు 'లకారం'పైనేగాని కిందలేదు.

శ్రమపడి గుంటూర్లో కుప్పిగంతుల ఆదికూర్మం కొడుకు వినయమూర్తిని అరవైవేలకు సెటిల్ చేసుకొచ్చాడు. ఏడుస్తూ...

కట్నం పెళ్ళిలో ఇస్తానన్నాడు.

లక్ష్మమ్మ పోరు పడలేక, లోలోపల దిగులు పడుతూనే దర్జాగా ఏర్పాట్లు చేయించాడు రంగనాథం.

కానీ పెళ్ళి టైంకు వియ్యంకుడు ఆదికూర్మాన్ని పక్కకు పిల్చి ముప్ఫయివేలు చేతిలో పెట్టి, "ఇవి కాస్త అనుకోండి.... డబ్బు అడ్జస్టుకాలేదు. శుభకార్యం ఆపొద్దు" అంటూ డ్రమెటిక్‌గా ఏడ్చాడు.

రంగనాథం కుక్కబుద్ధి అర్థం చేసుకున్న ఆదికూర్మం పెళ్ళి అయ్యేదాకా ఏం మాట్లాడకుండా, పెళ్ళయిన తరువాత కొడుక్కు మామాసురుడి ప్లాను చెప్పాడు.

మామకు బుద్ధి చెప్పాలనుకున్నాడు వినయమూర్తి. ఆ సాయంత్రం అల్లుణ్ణి డాబామీదికి పిల్చుకెళ్ళాడు రంగనాథం.

"అల్లుడుగారూ.... అనవసరంగా కట్నండబ్బు దుబారా చెయ్యకుండా ఓ ఇల్లు కట్టిస్తే మీరూ, అమ్మాయీ సెపరేట్‌గా ఉండొచ్చుగా?" పాడివేసాడు రంగనాథం.

"చూడండి మామగారూ.... మీకు తెలీదనుకుంటా, మాకు లక్ష రూపాయల అప్పుంది.... అది తీరాలంటే పొలం అమ్మాలి.... ఈ వ్యవహారాలయ్యేసరికి ఓ సంవత్సరం ఎటూ పడుతుంది. చూసారూ, అందుకే ఇప్పట్లో మీ అమ్మాయిని తీసుకెళ్తే ఖర్చు జాస్తి అవుతుంది. కాబట్టి మీ అమ్మాయిని ఒక సంవత్సరం మీ ఇంట్లోనే ఉంచుకోండి.... అప్పు తీరింతర్వాత అంపకాలు, గృహప్రవేశాలు చేసుకుందాం."

"మరి ఇల్లు...?"

"వ్యవహారం పూర్తయి, మీ అమ్మాయి మా ఇంట్లో గృహప్రవేశమైన రెండేళ్ళకుగానీ ఇల్లుకట్టలేనండీ" వినయంగాఅన్నాడు వినయమూర్తి.

రంగనాథానికి అల్లుడుకొట్టిన చెప్పుదెబ్బ అర్థమైంది. గబగబా వెళ్ళి కొరవ కట్నండబ్బు తెచ్చి వినయమూర్తికిచ్చి, "బాబూ ఇవి తీసుకో.... దయచేసి అమ్మాయిని మీ ఇంటికి తీసుకెళ్ళు" అల్లుణ్ణి అర్థించాడు.

డబ్బువేపు చూస్తూ, "సరే... మీరు ఇంతగా ప్రాధేయపడుతున్నారు కాబట్టి." చిరునవ్వు చిందిస్తూ వినయంగా అన్నాడు వినయమూర్తి.

— బిట్రగుంట సాయిబాబా
(ఒంగోలు)

### ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

**"తల్లిలాంటి వదినపై చేయిచేసుకోవడానికి నీకు మనసెలా ఒప్పిందిరా మూర్ఖుడా!" అన్న అక్క మాటలతో, ఆలోచిస్తున్న మధు ఈలోకంలోకి వచ్చాడు.**